## ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలపై కదిలించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

6 లో






www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

బుధవారం | 08 | ఏప్రిల్ | 2026 పేజీలు : 8


# అప్పుడే చుర్రుమంటుంది..!



**-పెరుగుతున్న ఎండలు**
**-అడుగంటుతున్న భూగర్భ జలాలు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎండలు అప్పుడే చురుమంటున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలోనే ఉదయం 10 గంటలకే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. గడిచిన రెండు రోజులుగా వేడి గాలులు సైతం వీస్తున్నాయి. గతేడాది మే మాసంలోనూ వర్షాలు పడడంతో అంతగా వేసవి అనిపించలేదు. కానీ ఈ ఏడాది ఇప్పటి నుంచే ఎండలు ప్రజలను భయపెడుతున్నాయి. 35 నుండి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలకు ప్రజలు తాళలేకపోతున్నారు. క్రమేపి భూ గర్భ జల నీటిమట్టం కూడా పడిపోతుంది. డిసెంబర్ మాసంలో మూడు మీటర్ల లోపు ఉన్న భూ గర్భ జలాలు మార్చి చివరి నాటికే నాలుగున్నర మీటర్ల ఎగువకు పడిపోయినట్లు మిగతా 2లో..

## ధాన్యం రైతుని ముంచిన నిస్తా కంపెనీ

**-తాలు అవుతుండడంతో రైతుల్లో ఆందోళన**
**-ఫిర్యాదు చేసిన స్పందించని డీలర్**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** కల్తీ విత్తనాలు మరోసారి రైతును దెబ్బతీశాయి. యాసంగిలో వరి సాగు చేసిన రైతులు కల్తీ విత్తనాల భారీనపడి భారీగా నష్టపోయారు. పాలకులు మారిన కల్తీ నివారణకు సంబంధించి చర్యలు చేపట్టడంలో అధికార యంత్రాంగం వైఫల్యం కనిపిస్తుంది. కల్తీ, నకిలీ కారణంగా పెట్టుబడులు పెట్టి దిగుబడులు రాక రైతులు నష్టపోతున్నారు. వైరా మున్సిపాలిటీ పరిధి లోని దిద్దుపూడి గ్రామానికి చెందిన రైతులు యాసంగిలో నిస్తా సీడ్స్ ఎస్6 ప్లస్ వరి విత్తనాలను సాగు చేశారు. నాటిన నాటి నుంచి ఏపుగానే పెరిగిన వరి ఈత సమయంలో వచ్చిన కంకులు ధాన్యం పోసుకోకుండా తాలు అవుతున్నాయి. ఒకట్రెండు చోట్ల రావడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. రెండు మూడు రోజుల్లోనే ప్రతి మొక్క నుంచి వచ్చి కంకి తాలుగా మారుతుండడంతో ఆందోళన చెందారు. నిస్తా సీడ్స్ ఎస్6ప్లస్ సాగు చేసిన నల్లమోతు సురేష్, నల్లమోతు హరీష్, కొత్తా సీతారామయ్య, బాలకృష్ణ తదితర రైతులు విత్తనాలు విక్రయించిన ఏజెంటును ఆశ్రయించారు. తాలు కావడానికి విత్తనంలో లోపం లేదని మీరే సరిగ్గా సస్యరక్షణ చర్యలు చేపట్టలేదని ఎదురు దాడికి దిగారు. ఆందోళన చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. నిస్తా సీడ్స్ ఎస్6ప్లస్‌కు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

## పరీక్షలు ముగియకముందే పదికి వల..!




**-ర్యాంకుల ఎరతో... ఫీజుల కోతకు సిద్ధమవుతున్న కార్పోరేట్ కళాశాలలు**
**-అధికారుల కళ్లుగప్పి...అడ్మిషన్ల కోసం కుమ్ములాట**
**-పిఆర్ఓలతో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్**
**-చోద్యం చూస్తున్న ఇంటర్ అధికారులు**

**ప్రజాపక్షం /ఖమ్మం విద్యావిభాగం :** పదవ తరగతి విద్యార్థులపై కార్పోరేట్ విద్యాసంస్తలు కన్నేశాయ్.పరిక్షలు ముగియకముందే ర్యాంకుల ఎరతో ,విద్యార్థుల భవిష్యత్‌ను పెట్టుబడిగా మార్చుకుంటూ ,నిబంధనలకు విరుద్ధంగా అక్రమ అడ్మిషన్‌లకు తెరలేపాయ్. ఐఐటి, నీట్, స్టేట్ ఎంట్రన్స్‌లకు కోచింగ్ పెరిట విద్యార్థుల తల్లి తండ్రులను బురిడి కోట్టిస్తున్నారు.ఇంటర్మిడియట్ అడ్మిషన్ ప్రక్రియ అదికారికంగా మెదలుకాకముందే సీట్లను భర్తి చేస్తున్నారు. లక్షలాది రుపాయలు పీజులు వసూలు చేస్తూ ,కనీస సౌకర్యాలు లేని ఇరుకైన గదుల్లో బోదన సాగిస్తూన్నారు.కార్పోరేట్,ప్రైవేట్ కళాశాలల్లో వందల సంఖ్యలో విద్యార్థులను చెర్చుకుంటూ బారి ఎత్తున ప్రచారాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సమాచారాన్ని సేకరించి తమ పీఆర్వోల ద్వారా అడ్మిషన్‌లను చేపిస్తున్నారు.ఇంత బహిరంగంగా నిబందనల ఉల్లంగన జరుగుతున్న సంబందిత విద్యాశాఖాదికారులు మౌనం వహించటం గమనారం. మిగతా 2లో..

## వైరా శ్రీనిధిలో భారీ కుంభకోణం..!




**-నారపనేనిపల్లిలో రూ.12లక్షలు గల్లంతు**
**-మహిళా సంఘాల నిధులు దోపిడీ**
**-అవినీతి జరిగిన నోరు మెదపని అధికారులు**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం శ్రీనిధిలో భారీ కుంభకోణం చోటు చేసుకుంది. రూ.12లక్షలను డ్వాక్రా గ్రూపుల నుంచి పనులు చేసిన గ్రామదీపిక జమ చేయకుండా తన వ్యక్తిగత అవసరాలకు వాడుకుంది. సుమారు రెండు సంవత్సరాల క్రితం గ్రామదీపిక అవినీతి బయటకు వస్తే జిల్లా అధికారులు, మండల అధికారులు ఎవరూ కూడా సీరియస్ యాక్షన్ తీసుకోకుండా మూడు సంవత్సరాల నుంచి ఇదేవిధంగా కొనసాగించారు. జరిగిన పెద్ద కుంభకోణాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా జిల్లా అధికారులు తీసుకుపోలేదు అంటే ఖమ్మం జిల్లా శ్రీనిధి వ్యవస్థ ఏ విధంగా ఉందో ఒక్కసారి అర్థం చేసుకోవాలి. వైరా మండలం ఇందిరా క్రాంతి పథకం క్రింద మండల పరిధిలోని నారపనేనిపల్లిలో 20గ్రూపులుగా గ్రామదీపిక హేమ పర్యవేక్షణ చేస్తూ గ్రూపుల వద్ద నుంచి డబ్బులు తీసుకొని బ్యాంకులో జమ చేస్తూ ఉంటుంది. సుమారు రెండున్నర సంవత్సరాల క్రితం గ్రామదీపిక హేమ తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం రూ.12లక్షలను డ్వాక్రా గ్రూపుల సభ్యులు తెలియకుండా వాడుకుంది. రెండు సంవత్సరాల క్రితం ఆడిట్ అధికారులు చేసిన ఆడిట్‌లో నారపనేనిపల్లిలో జరిగిన భారీ శ్రీనిధి కుంభకోణం బయటపడింది. ఈ విషయాన్ని అప్పనటి పిడి సన్యాసయ్య, ప్రస్తుత ఆర్‌ఎం నాయక్, అసిస్టెంట్ మేనేజర్ ముత్తమ్మ తెలిసిన కూడా ఆమెను మందలించి వదిలిపెట్టారు తప్ప జరిగిన భారీ కుంభకోణంలో పూర్తిస్థాయిలో జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకుపోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని చెప్పవచ్చును. రూ.12లక్షలను వాడుకున్న గ్రామదీపిక సుమారు సంవత్సరం క్రితం డ్వాక్రా గ్రూపు సభ్యులకు మిగతా 2లో..

# వైరా శ్రీనిధిలో భారీ కుంభకోణం..!

(మొదటిపేజీ తరువాయి)



తెలియకుండా రూ.5లక్షలను జమ చేసింది. అప్పటి నుండి ఇప్పటివరకు మిగతా రూ.7లక్షలను జమ చేయలేదు. రూ.7లక్షల వడ్డీని కట్టకుండా తన ఇష్టానుసారంగా ఉంటే చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రం పూర్తిస్థాయిలో విఫలమైందని చెప్పవచ్చును. బాధ్యత గల జిల్లా అధికారులు సైతం అవినీతి జరిగినప్పుడు ఎందుకు చర్యలు పూర్తిస్థాయిలో తీసుకోలేదు. రూ.12లక్షల కుంభకోణం జరిగితే ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అధికారులు మౌనం ఏమిటి అనేది కూడా ఇప్పుడు ఆలోచించాలి. గ్రామదీపిక ప్రస్తుతం అందుబాటులో లేకుండా ఉండటం, ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ రావడం ఇప్పుడు తీవ్ర ఆరోపణలకు తావిస్తున్నాయి. అధికారులకు తెలిసినా ఎందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేకపోయారు. బాధ్యత గల ఆర్ఎం నాయక్, అప్పటి పిడి సన్యాసియా ఎందుకు మౌనం పాటించారు. పేదల కష్టాన్ని దోసుకుంటుంటే ఎందుకు మౌనం పాటిస్తున్నారు. గ్రామాల్లో మహిళలు ప్రతిరోజు కూలి పనులు కష్టపడి చేసుకొని పొదుపు కడుతుంటే గ్రామదీపికలు ఈ విధంగా అవినీతికి పాల్పడటం ఎంతవరకు కరెక్ట్ వైరా మండలంఓల గ్రామదీపికవల పర్యవేక్షణపై నిఘా ఏమైంది. సిసిలు కూడా ఎందుకు మౌనంగా ఉంటున్నారు. జరిగిన అవినీతిని పూర్తిస్థాయిలో బయటపెట్టకుండా అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలి. ఎందు కు అంటే ఈ పెద్ద కుంభకోణంలో అధికారుల మౌనంపై అనుమానాలు తాగిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని వైరా మండలం నారపునేనిపల్లిలో జరిగిన శ్రీనిధి కుంభకోణంలో డబ్బులు రికవరీ చేసి జమ చేసే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలి.

# అప్పుడే చుర్రుమంటుంది..!

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు సూచిస్తున్నారు. సింగరేణి, ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో ఎండ వేడిమి చాలా ఎక్కువగా ఉంది. గనుల వద్ద వేసవి నివారణ చర్యలు చేపట్టాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఉపశమన చర్యలు చేపట్టకపోతే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఎండలను తాళలేక ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. కొబ్బరిబొండాలు, కూల్‌డ్రింక్స్, తాటి ముంజలు, వాటర్ బాటిల్స్, జ్యూస్‌లు తదితర పానీయాలకు డిమాండ్ పెరిగింది. వృద్ధులు, పిల్లలు సహా ఎండలో బయటకు వెళ్లకుండా, వడదెబ్బకు గురికాకుండా వీలైనంత మేర తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అధికార యంత్రాంగం సైతం అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. ఈ ఏడాది తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఖమ్మం జిల్లాలో సాగర్ పరివాహక ప్రాంతంలో నీటి ఎద్దడి అంతగా లేకపోయినా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో భానుడి ప్రతాపానికి ప్రజలు తాళలేకపోతున్నారు. భూగర్భ జల మట్టం గణనీయంగా పడిపోయింది. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పరీక్షలు ముగియకముందే 'పది'కి వల..!

(మొదటిపేజీ తరువాయి)

### రూ.లక్షల్లో పీజుల వసూళ్లు...

ఖమ్మం జిల్లాలో రాష్ట్రంలో పేరొందిన కార్పోరేట్ కళాశాలలు ఉన్నాయ్.ర్యాంకులను ఎరవేస్తు అడ్మిషన్‌ల ప్రక్రియను పిర్వోవోల ద్వారా పూర్తి చేస్తున్నారు.ఏక్కడికక్కడ వారికి ఏక్కువ మెత్తంలో డబ్బులు ముట్టచెబుతున్నారు.తమ కళాశాలో చేరిన విద్యార్దులకు ఒక్కోక్కరి నుంచి రేండేళ్లలో లక్షల పీజులు వసూలు చేస్తూన్నారు.కళాశాలలో చేరినప్పుడే టీచింగ్,వసతి,పుస్తకాలు,లైబ్రరి,హెల్త్ పేరుమీద డబ్బులు తీసుకుంటున్నారు.ఐఐటి,నీట్,ఎంసెట్,ఇతర కోచింగ్ లకు అదనంగా వసూలు చేస్తున్నారు.స్మార్ట్ భ్యాచ్ లు,అడ్యాన్స్ భ్యాచ్ ల పేరు మీద ఎక్కువ మెత్తంలో వసూలు చేస్తున్నారు.



### అనుమతులు నిల్...

అద్దెభవనాలు పుల్ జిల్లా పరిదిలో కార్పోరేట్ కళాశాలలు కోన్నింటికే అనుమతులు తీపుకోని భ్రాంచ్ ల పేరిట ఏక్కువ మందిని చేర్చుకంటున్నారు.అపార్ట్‌మెంట్ లు,భవనాలను అద్దెకు తీసుకోని తరగతులను నిర్యహిస్తున్నారు.రేండేళ్ల పాటు విద్యార్దులను ఇరుకు గదుల్లో కుక్కి లక్షల్లో పీజులను వసూలు చేస్తున్నారు.ఇంత జరుగుతున్న ఇంటర్మీడియట్ అదికారులు మాత్రం కార్పోరేట్ కళాశాలల వైపు కన్నేత్తి చూడటం లేదు.నిబంధననలకు విరుద్దంగా నడుస్తున్న భ్రాంచ్ లపై విద్యార్ధి సంఘాలు పిర్యాదు చేసినా అదికారులు పట్టించుకోవడం లేదు.కార్పోరేట్ కళాశాలల నజరానాలు,కౌన్సిలింగ్ మాయ లో పడి తల్లి తండ్రులు కూడా తమ పిల్లలను చేర్పిస్తున్నారు.నిబందనలకు విరుద్దంగా జరుగుతున్న కార్పోరేట్ కళాశాలలపై అదికారులు ద్రుష్టి పెడితె విద్యార్ధుల తల్లి తండ్రులకు మేలు జరిగే అవకాశం ఉంది.

# చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష, మూడు లక్షలు పరిహారంగా చెల్లించాలని తీర్పునిస్తూ ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.దీప తీర్పునిచ్చారు. ఖమ్మం పట్టణానికి చెందిన రాజేష్ వద్ద నిందితుడు 2019 డిసెంబర్ 20న కుటుంబ అవసరాల కోసం మూడు లక్షలు అప్పు తీసుకున్నాడు. ఇందుకు సంబంధించి ప్రాంసరీ నోటు సైతం రాసిచ్చాడు. రుణం చెల్లించాలని ఒత్తిడి చేయడంతో 5 ఫిబ్రవరి 2021న మూడు లక్షలకు చెక్కు జారీ చేశాడు. ఫిర్యాదుదారి చెక్కును బ్యాంకులో జమ చేయగా నగదు లేకపోవడంతో తిరస్కరణకు గురైంది. న్యాయవాది పోట్లపల్లి విప్లవ్‌కుమార్ ద్వారా న్యాయ స్థానాన్ని ఆశ్రయించగా విచారణ జరిపిన న్యాయాధికారి పైవిధంగా తీర్పునిచ్చారు.

# కోతుల బెడద నివారణకు చర్యలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** 48వ డివిజన్‌లో కోతుల బెడదను నివారించేందుకు కార్పొరేటర్ తోట గోవిందమ్మ రామారావు చర్యలు చేపట్టారు. ప్రజలను భయ భ్రాంతులకు గురి చేయడమే కాకుండా కోతులు ప్రజలపై దాడులు చేస్తూ గాయాలపాలు చేస్తున్నాయి. డివిజన్ ప్రజలు ఈ విషయాన్ని కార్పొరేటర్ తోట గోవిందమ్మ రామారావు కు తెలియజేయడంతో వెంటనే నివారణ చర్యలు చేపట్టారు. డివిజన్ పరిధిలోని సుమారు 200 కోతులను బంధించి దట్టమైన అటవీ ప్రాంతానికి తరలించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తోట రామారావు, కార్పోరేషన్ జవాన్, ప్రాంత నాయకులు ప్రభాకర్, వీరస్వామి, బాబు, రాము, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న పాలకులు

## -యువజనోద్యమాలతోనే సమాజంలో మార్పు



**ప్రజాపక్షం/ ఖమ్మం / కొణిజర్ల :** పాలకులు యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నారని ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక యువత నైరాశ్యానికి గురవుతుందని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్ తెలిపారు. దేశ జనాభాలో సగ భాగం కలిగిన యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. మంగళవారం కొణిజర్ల మండల పరిధిలోని తనికెళ్ల గ్రామ అఖిల భారత యువజన సమాఖ్య మహసభ నరేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో చింతల రమేష్ మాట్లాడుతూ యేటా రెండు కోట్ల ఉద్యోగాలంటూ అధికారంలోకి వచ్చిన మోడీ ఆ ఊసెత్తకపోగా ఉన్న ఉద్యోగాలను ఊడదీసే ప్రయత్నంలో ముందు వరుసలో ఉన్నారన్నారు. మోడీ పాలన మొత్తం కాంట్రాక్టీకరణ, ప్రైవేటీకరణ మయంగా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చడం లేదన్నారు.ఉన్నత విద్యను అభ్యసించిన అనేక మంది కోచింగ్ సెంటర్ల వద్దనే సగం జీవితాన్ని కోల్పోతున్నారని ఆయన తెలిపారు. యువత ఉద్యమిస్తేనే సమాజ మార్పు సాధ్యపడుతుందన్నారు. యువజన సమస్యల పరిష్కారం, నిరుద్యోగ భృతి, ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని రమేష్ తెలిపారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు మునిగ కోటేశ్వరరావు, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, నాగరాజు, సైదారావు, ఎల్లయ్య, మల్లికార్జున్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఐకెపి పిడి ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/కల్లూరు :**



కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఐకెపి పిడి శ్రీరామ్ అడిషనల్ డిఆర్‌డిఓ జయ శ్రీ, ఇన్చార్జి డిపిఎం శ్రీనివాస్ రావు మంగళవారం చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, చెన్నూరు, కొర్లగూడెం, పోచవరం తదితర గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభానికి ప్రత్యక్షంగా స్థలాలను పరిశీలించి అధికారులతో సమీక్ష చేశారు. కల్లూరు మండల పరిధిలోని చిన్న కోరుకోండి లో సోలార్ ప్లాంట్ తోపాటు ఉపాధి హామీలో భాగంగా వన నర్సరీలు తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉండి వారికి నాణ్యమైన ధరను అందేలా చూసి దళారులు పాలు కాకుండా రైతుల ఇబ్బందులు పడకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం అశోక్ రాణి, వివో ఏలు, సీసీలు పాల్గొన్నారు.

# నూతన అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/బూర్గంపాడు:**



బూర్గంపాడు మండలం ఉప్పుసాక గ్రామ పంచాయితీ పరిధిలోని రాజీవ్‌నగర్ ఆదివాసి గ్రామంలో నూతన అంగన్వాడీ కేంద్ర భవనం నిర్మాణం పూర్తి చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ నిర్మాణం ఎంఎస్ సెరెంగెటి ఎస్టేట్స్, డల్లాస్(టెక్సాస్ అమెరికా)ఆర్థిక సహకారంతో చేపట్టడం విశేషం. గ్రామంలో అంగన్వాడీ భవనం లేకపోవడంతో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానిక సామాజిక సేవకులు, ఉపాధ్యాయులు రూప్లా నాయక్ గుర్తించి ఖమ్మం వాస్తవ్యులు కొంగర పురుషోత్తంరావు, రామచంద్రరావు దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే స్పందించి తమ కుటుంబ సభ్యుల సహకారంతో సుమారు రూ 2లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ అంగన్వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ సిడిపివో కె రేవతి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి, అనంతరం అధికారంగా ఐసిడిఎస్ శాఖకు అప్పగించారు. ఈకార్యక్రమం అనంతరం గర్భిణీ స్త్రీలకు సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఐటిసి ఐజీడి ప్రమీల, సెక్టర్ సూపర్వైజర్లు స్వరాజ్యం, సక్కుబాయి, జగదాంబ, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు, వార్డు సభ్యులు భీమరాజు, భద్రయ్య, దేవయ్య, జోగయ్యతో పాటు గర్భిణీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

# రాయన్నపేటలో పశువైద్య శిబిరం

**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలం రాయన్నపేటలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామంలోని 75 పశువులకు టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి అన్వేష్ తెలిపారు. గ్రామ సర్పంచ్ కర్నాటి రామకోటేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించారు. పశువుల ఆరోగ్యం కాపాడేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు నాగేశ్వరరావుతో పాటు పశువైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎండిపోతున్న చెట్లు..!

## పట్టించుకోని అధికారులు..

**ప్రజాపక్షం/కల్లూరుః**



కల్లూరు పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలలో ఉన్న విలువైన చెట్లు మండే ఎండలకు ఎండిపోతున్నాయి. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ ఉన్నారు. పట్టణంలోని ఎన్ఎస్పి కార్యాలయ ఆవరణ, ఎంపీడీవో, తహశీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలలో విలువైన చెట్లు తో పాటు పలు రకాల చెట్లు ఎండిపోతున్న దీంతో అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మోడు వారుతున్న చెట్లు పట్ల ఆ శాఖ అధికారులు చూసినట్లు వ్యవహరిస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు చెట్లను నీరు పోసి రక్షించాలని కోరుతున్నారు. రక్షించాల్సిన అధికారులు చూడకుండా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి



**-ఆసుపత్రిలో మందుల నిల్వలు సమృద్ధిగా ఉంచాలి**
**-యుపిహెచ్‌సిని తనిఖీ చేసిన కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి తెలిపారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఖమ్మం నగరంలోని వెంకటేశ్వర నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, ల్యాబ్, మెడికల్ వార్డు, మరుగుదొడ్ల శుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో అవసరమైన ఔషధాల లభ్యతపై ప్రత్యేకంగా విచారించి అన్ని రకాల అవసరమైన మందులను తగిన స్థాయిలో నిల్వ ఉంచాలని ఆదేశించారు. ల్యాబ్ పరీక్షలు, డయాగ్నొస్టిక్ హబ్ సేవల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పరీక్షల రిపోర్ట్‌లను వీలైనంత త్వరగా రోగులకు అందించాలన్నారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచి రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి పిహెచ్‌సి, అర్బన్ పిహెచ్‌సిలలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది వివరాలను సమగ్రంగా సమర్పించాలని తెలిపారు. ప్రతి కేంద్రంలో మంజూరు చేసిన పోస్టులు, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది, ఖాళీల వివరాలను స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఈ నివేదిక ఆధారంగా జిల్లాలో సిబ్బంది ఎక్కడ తక్కువగా ఉన్నారో గుర్తించి తక్షణమే వాటిని భర్తీ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. డిప్యూటేషన్ పై పనిచేస్తున్న సిబ్బంది సంఖ్యను కూడా ఖచ్చితంగా ధృవీకరించాలని డిఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయ ఏవో డాక్టర్ మోత్యాను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వైద్య అధికారిణి ఐ. దేవిశ్రీ, నర్సింగ్ అధికారిణి సయ్యద్ షమీమ్, ఫార్మసిస్టు ఎస్‌కె ముదస్సర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరలు పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 33వ డివిజన్‌లో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. మంగళవారం డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి మహిళకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో కూడా ఇందిరమ్మ చీరల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తోట ఉమారాణి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ తల్లాడ రమేష్, తోట వీరభద్రం, సున్నా సత్యనారాయణ, పల్ల ప్రమీల, నల్లపు శ్రీనివాస్, సైదులు, పిడుగు మల్లికార్జున్, ఉపేందర్, బోల్లేపల్లి సత్యనారాయణ, ఆర్‌పిలు సోని, సుశీల, వహిదా తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించాలి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించాలని చీఫ్ లీగల్ ఎడ్ డిఫెన్స్ కౌన్సిల్ బి. శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాను సారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఖమ్మం ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం మామిళ్లగూడెం ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానాలను పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. డబ్బు పోతే మళ్లీ సంపాదించుకోవచ్చునని ఆరోగ్యం దెబ్బతింటే కోలుకోవడం కష్టమని తెలిపారు. ఎవరికైనా న్యాయ పరమైన సలహాలు, సూచనలు కావాలంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. డా॥ ఎన్. కృష్ణచైతన్య మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్యులు, నర్స్, ఇతర సిబ్బంది, మందులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రోజుకు 100 మంది తమ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. మెరుగైన సేవలు ప్రభుత్వ ఆసుపత్రిలో లభిస్తాయని తెలిపారు.

# పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

**-సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తన సిఫారసుతో మంజూరైన చెక్కులను ఎంపి రామసహాయం రఘు రాంరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ వివిధ అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం లబ్ది చేకూరుస్తుందన్నారు. వివిధ మండలాలకు చెందిన 265 మంది లబ్దిదారులకు రూ. 75.40 లక్షలు విలువ చెక్కులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా లబ్దిదారులు ఎంపి రఘురాంరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీనారాయణ, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, వివిధ మండలాల సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి



**ప్రజాపక్షం/ మధిర :** నేటి సమాజంలోని వాతావరణం, పరిస్థితుల దృష్ట్యా ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై తగిన జాగ్రత్త వహించాలని శ్రీరక్ష హాస్పటల్ అధినేత ప్రముఖ వైద్యులు గోంగూర వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శ్రీరక్షా హాస్పటల్ వారి ఆధ్వర్యంలో చేపట్టి ఆరోగ్యయాత్రలో భాగంగా మధిర మండలంలోని మల్లారం గ్రామంలో ఆరోగ్య యాత్రను నిర్వహించారు. ఈస ందర్భంగా వైద్యశిబిరాన్ని నిర్వహించి రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ లక్ష్మీ ఉపేందర్ ఆధ్వర్యంలో వైద్యులు జివిని ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ప్రశాంతతను కోల్పోయి ఎంతో ఒత్తిడిని లోనై మన ఆరోగ్యాన్ని మనమే చెడగొట్టుకుంటున్నామని, పిల్లలు డ్రగ్స్‌కి అలవాటు పడి తమ జీవితాలను కోల్పోతున్నారని, తెలిసి తెలియని వయస్సులో గంజాయి మత్తులో తూలుతున్నారని, తమ భవిష్యత్‌ని ఆలోచించి తల్లిదండ్రులు పిల్లల పట్ల ఎంతో జాగ్రత్తలు వహించాలని అన్నారు. డాక్టర్ జివి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. ప్లాస్టిక్ వాడటం ఆరోగ్యానికి హానికరమని, ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం మన గ్రామ ప్లాస్టిక్ వాడటం ఆరోగ్యానికి ఎంతో హానిచేస్తుందని, మన ఆరోగ్యం పట్ల మనం ఎంతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే ఆహారపు అలవాట్లలో ఎంతో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, శ్రీరక్ష హాస్పటల్ యాజమాన్యం, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ పరిశుభ్రత విషయంలో రాజీపడేది లేదు



**ప్రజాపక్షం/మధిర :** ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ మధిర పట్టణ పరిశుభ్రత విషయంలో రాజీపడేది లేదని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత అన్నారు. మంగళవారం ఉదయం 5గంటలకి పారిశుద్ధ్య కార్మికుల బయోమెట్రిక్ విధానాన్ని ఆమె పరిశీలించి పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. మధిర మున్సిపాలిటీలో పారిశుద్ధ్య, ఇతర సిబ్బంది హాజరును పకడ్బందీగా నమోదు చేసేందుకు, అవినీతిని అరికట్టేందుకు, సమయపాలన పాటించేందుకు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయటం జరిగిందని తెలిపారు. బయోమెట్రిక్ హాజరు విధానంలో ఉదయం, సాయంత్రం రెండు పూటలా పారిశుద్ధ్య కార్మికుల వేలి ముద్ర ద్వారా హాజరును రికార్డ్ చేస్తుందని, అలాగే వారి జీతాలతో అనుసంధానించబడి ఉంటుందని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకే పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు నిరంతరం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## టిబి రహిత సమాజం కోసం పాటుపడుదాం



**ప్రజాపక్షం/ మధిర మున్సిపాలిటీ :** టిబి రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోన ధనికుమార్ అన్నారు. మధిర పట్టణంలో ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత టిబి నిర్ధారణ పరీక్షల క్యాంపును మంగళవారం నిర్వహించారు. ఈ క్యాంపును వారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఉచితంగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయటం జరిగిందని, ఈ శిబిరంలో క్షయ అనుమానిత కేసులకు ఉచితంగా ఎక్స్‌రే పరీక్షలు చేయటం హర్షించదగ్గ విషయమని అన్నారు. హెల్త్ సూపర్వైజర్ లంకా కొండయ్య బృందం ప్రపంచ ఆరోగ్య దినం సందర్భంగా పలు జబ్బుల చిత్రపటాలు, ఫ్లెక్సీ చిత్రాలను ప్రదర్శనగా ఏర్పాటు చేసి వ్యాధులపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దెందుకూరు పిహెచ్‌సి మెడికల ఆఫీసర్ డాక్టర్ పృధ్వీరాజ్‌నాయక్, మడుపల్లిబస్తీదావఖానా వైద్యురాలు డాక్టర్ సుస్మా,మధిర టిబి యూనిట్ సిబ్బంది,ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గంగారంకు ఉత్తమ పిహెచ్‌సి అవార్డు




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని గంగారం పిహెచ్ సి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పిహెచ్ సి అవార్డ్ ను సొంత చేసుకుంది. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం రవీంద్ర భారతి లో జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో నేషనల్ ట్యూబర్ క్యులోసిస్ ఎలిమినేషన్ ప్రోగ్రామ్ (ఎన్‌టిఈ పి) కింద రాష్ట్ర స్థాయి ఉత్తమ పీహెచ్‌సీ అవార్డును పీహెచ్‌సీ స్వీకరించింది. ఆరోగ్య మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చేతుల మీదుగా ఈ అవార్డును డా. సుబ్బారావు (డిటిసిఒ), సురేష్ (ఎస్‌టి ఎస్ టిబి) సమక్షంలో పిహెచ్ సి వైద్యులు డా. అవినాష్ స్వీకరించారు. ఉత్తమ పిహెచ్‌సి గా గంగారం పిహెచ్‌సి ని రాష్ట్ర స్థాయిలో నిలిపినందుకు డా. అవినాష్ ను ఎమ్మెల్యే రాగమయి, రాష్ట్ర నాయకుడు దయానంద్, గంగారం గ్రామ నాయకులు, ప్రజలు అభినందించారు.

## యుద్ధాన్ని వ్యతిరేకిద్దాం : పొన్నం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అమెరికా ఇజ్రాయిల్ విధానాలకు మద్దతు ఇవ్వడం వల్ల నిత్యావసర వస్తువుల ధర లు పెరుగుతున్నాయని, యుద్ధాలను వ్యతిరేకిస్తూ శాంతి కోసం ప్రజలు పోరాడాలని, రాజ్యాంగాన్ని కాపాడుకుందామని జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కమిటీ సమావేశం స్థానిక రావి వీర వెంకయ్య భవన్‌లో తన్నీరు కృష్ణార్జున రావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు హాజరై కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపిస్తూ, బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించడం వల్ల కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఉపాధి హామీ పథకానికి సంవత్సరానికి రూ.3 లక్షల కోట్లు కేటాయించి, 200 రోజుల పని కల్పించడంతో పాటు రోజుకు రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ భరోసా, ఇళ్ల పథకాలు, మహిళల ఆర్థిక సహాయం హామీలు ఇంకా అమలు కాలేదని విమర్శించారు. వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 20, 21 తేదీల్లో మండల కార్యాలయాల వద్ద, మే 15 న కలెక్టరేట్ల ముందు నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం, రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాయిస్ఫూర్తిలో బాల్య క్యాన్సర్‌పై అవగాహన



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ ఇంటర్నేషనల్ సహకారంతో విద్యార్థులకు బాల్య క్యాన్సర్‌పై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డా. గుళ్లపూడి రమ్య, రేడియాలజిస్ట్ డా. శ్రీహరి పాల్గొని క్యాన్సర్ లక్షణాలు, రకాలు, ముందస్తు గుర్తింపు ప్రాముఖ్యతపై వివరించారు. బాల్యంలో వచ్చే క్యాన్సర్లు అరుదుగా ఉన్నప్పటికీ తొలిదశలో గుర్తిస్తే 7090% వరకు నయం చేయవచ్చని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ బండి పార్థ సారథిరెడ్డి, ట్రస్టీ అన్విద వర్మపల్‌గా ప్రసంగిస్తూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. కళాశాల నిర్వాహకులు, అధ్యాపకులు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలపై కదిలించాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఇంటింటికి సిపిఐ పేరుతో ప్రతి ఇంటిని తట్టి సమస్యలపై ప్రజలను కదిలించాలని ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిపిఐ సత్తుపల్లి టౌన్ మండల కమిటీల సమావేశం చాకలి ఐలమ్మ భవన్ లో పాలకుర్తి వీరయ్య అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు కారణంగా సామాన్య ప్రజలు బతకడం కష్టంగా మారిందని, యుద్ధం పేరుతో ప్రజలపై భారాల మీద భారాలు వేస్తూ సామాన్యులకు బ్రతుకు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి పేదల పొట్ట కొట్టేందుకు బాజాపా ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. పట్టణాల్లో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వారి సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని ఎద్దేవా చేశారు. దేశంలో పేదలు మరింత పేదలుగాను, ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతున్నారని , మోడీ విధానాల కారణంగా రైతులు, కూలీలు, కార్మికులు, కష్టజీవులు దేశవ్యాప్త ప్రజానీకం ఇబ్బందుల్లో కూరుకు పోయారని ఆయన విమర్శించారు. అదే విధంగా రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి ప్రజలకు మరింత చేరువు కావాల్సిన అవసరం ఉందని, ప్రజలకు ఇచ్చిన హామీలు త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు సింగ్ నరసింహారావు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కమ్యూనిస్టులు అవసరం పెరిగిందని ప్రజా సమస్యలు ఎక్కడ ఉంటే కమ్యూనిస్టులు అక్కడ ఉంటారని, కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గం, పట్టణంలో ఇళ్ల స్థలాలు లేని పేదలు అనేకమంది ఉన్నారని వారందరికీ ఇళ్ళ స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, శిఖం భూములు పేదలకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ టౌన్ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, మండల కమిటీ సభ్యులు దండు జగన్, రామారావు, కోలేటి వెంకటేశ్వరరావు, నాగరాజు, ఎస్.కె కాసింబి, ఎస్.కె జాన్ బి, సునీల్, గిరి తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సును ఢీకొట్టిన లారీ

**- 15మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు**

**- మానవత్వం చాటుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ అనిత**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణపురం వద్ద గల బైపాస్‌పై రోడ్డు ప్రమాదం మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు కేజీబీవీ పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు రాశారు. అనంతరం విద్యార్థులను ఎక్కించుకొని బస్సు గొల్లగూడెం వైపు తిరుగుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుమారు 15మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు అప్రమత్తమై విద్యార్థులను అంబులెన్స్ ద్వారా గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**- మానవత్వం చాటుకున్న చైర్ పర్సన్...**

అటుగా వెళ్తున్న చైర్ పర్సన్ పోకబత్తిని అనిత మానవత్వం చాటుకున్నారు. భయంతో ఉన్న విద్యార్థులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వారు ఎలాంటి ప్రమాదానికి లోను కాకుండా తక్షణ చర్యలు చేపట్టారు. అలాగే గాయపడిన విద్యార్థులను అంబులెన్స్‌లో ఎక్కించి ఆసుపత్రికి తరలింపు చేపించి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ చూపిన చొరవపై స్థానికులు అభినందనలు తెలిపారు.

# 23న ఆశాల నిరవధిక సమ్మె

**- ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఆశా వర్కర్ల సమస్యలపై ఈనెల 23 నుండి చేపట్టనున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం ఆశాడేను ఎంవీ, పాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఆశా వర్కర్ల సమ్మె శిబిరాలను సందర్శించి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నెలకు రూ.18వేల నిర్దిష్ట వేతనం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్న సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు ఆశా వర్కర్ల సమస్యలను పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు రూ.10లక్షల ఆరోగ్య జీవ బీమాను ప్రభుత్వమే కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈనెల 14న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పణ, ఈనెల 20న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాను జయప్రదం చేసేందుకు ఆశాలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యుడు మైధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, తెలంగాణ రాష్ట్ర ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి శ్రావణి, కోకన్వీనర్ కళావతి, నాయకురాల్లు నారపొంగు ఝాన్సీ, అరుణకుమారి, జయమ్మ, ఆదిలక్ష్మి , శారదా, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో కొనసాగుతున్న నోటీసుల జారీ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీఓల రోడ్ల ప్రక్కన డ్రైనేజ్ దాటి ఆక్రమణకు పాల్పడి షాపులు, రేకులు నిర్మించిన వారికి మంగళశారం నాడు కూడా వైరా మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి భాస్కర్ మున్సిపల్ సిబ్బందితో కలిసి నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే వైరా మున్సిపాలిటీ మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవేకి వాహనాల తాకిడి విపరీతంగా పెరగడంతో పోలీసులు కూడా రోడ్ల ప్రక్కన షాపులు నిర్వాహకులతో సమీక్ష సమావేశాలు కూడా నిర్వహించారు. డ్రైనేజీలుదాటి షాపులు నిర్మించడం రేకులు వేయడం వ్యాపార సముదాయాల వస్తువులు బయటపెట్టడం లాంటి చేయవద్దని నోటీసుల్లో పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేవిధంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రోడ్ల ఆక్రమణలను తొలగించేందుకు ముందస్తుగా నోటీసులు జారీ చేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలుపుతున్నారు.

# మొక్కజొన్న రైతులకు న్యాయం జరిగేనా..!

**- మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని రైతుల డిమాండ్**



**ప్రజాపక్షం/ బోనకల్ :** వానాకాలంలో పత్తి పంటకు సరైన ధరలు లేకపోవడం వల్ల తీవ్ర నిరాశకు గురైన రైతులు ఈసారి మొక్కజొన్న సాగు వైపు మొగ్గుచూపారు. అధిక ఆశలతో, అప్పులు చేసి శ్రమపెట్టి సాగు చేసినా ఆశించిన దిగుబడి రాకపోవడంతో రైతులు మరోసారి ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. అయినప్పటికీ తమ పరిస్థితిని దిగమింగుకుని వ్యవసాయం కొనసాగించడం తప్ప మరో మార్గం రైతులకు కన్పించడం లేదు. ప్రస్తుతం మొక్కజొన్నకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర సుమారు రూ.2400 ఉన్నప్పటికీ మార్కెట్‌లో ప్రైవేట్ వ్యాపారులు కేవలం రూ.1300 నుండి రూ.1400 మధ్యే కొనుగోలు చేస్తున్నారు. ఈ భారీ తేడా రైతులను తీవ్రంగా నష్టపరిచే పరిస్థితిని తీసుకువచ్చింది. దిగుబడి తక్కువగా ఉండటం ఒక వైపు సరైన ధర దక్కకపోవడం మరోవైపు రైతు జీవితం మరింత సంక్షోభంలో పడుతోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడం వల్ల రైతులు తప్పనిసరిగా ప్రైవేట్ దళారులపై ఆధారపడాల్సి వస్తోంది. ఇది వారికి అన్యాయం జరిగే పరిస్థితిని సృష్టిస్తోంది. రైతులు తమ పంటను సరైన ధరకు అమ్ముకునే హక్కు ఉన్నప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో అది కేవలం ఆశగా మిగిలిపోతోంది. ఈ నేపథ్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. కనీస మద్దతుధరకు పంటను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటే రైతులకు కొంత ఊరట లభిస్తుంది. అదేవిధంగా మధ్యవర్తుల దోపిడికి కూడా అడ్డుకట్ట పడుతుంది. వ్యవసాయం దేశానికి వెన్నెముకగా భావించే మన దేశంలో, రైతు సంక్షేమం అత్యంత ప్రాధాన్యమైన అంశం. రైతు కష్టానికి సరైన ప్రతిఫలం దక్కేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. లేకపోతే రైతు ఆత్మ స్థైర్యం దెబ్బతిని భవిష్యత్‌లో వ్యవసాయం చేయడానికి వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. మొక్కజొన్న రైతులు కష్టాలు తీరాలంటే కొనుగోలు కేంద్రాలే మార్గం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఎంపికి వినతి



**ప్రజాపక్షం/ బోనకల్ :** గోవిందాపురం(ఎ) గ్రామంలో ఉన్న రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జి లేకపోవడం వల్ల గ్రామస్తులు, రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ ప్రాంతంలో అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరు తూ ఎంపి రామసహాయం రఘురామిరెడ్డికి మంగళవారం స్థానికులు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క చొరవతో గ్రామంలో రోడ్డు నిర్మాణం జరిగిందని, కాని రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి లేకపోవడంతో రైల్వే గేటు వద్ద గంటల తరబడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయంపై స్పందించిన ఎంపి మాట్లాడుతూ రైల్వే అధికారులతో మాట్లాడి ఆర్‌యుబి నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఇదే గ్రామానికి చెందిన ఇస్రం వినోద్, భాగం లక్ష్మి కి సంబంధించిన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపి అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు భాగం నాగేశ్వరరావు, ఉమ్మని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మైనింగ్ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు

**- తహశీల్దార్ ఉషాశారద**



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండల పరిధిలో మైనింగ్ అనుమతులు లేకుండా తమ ఇష్టానుసారంగా అక్రమంగా మట్టిని తరలించే వారిపై ప్రభుత్వపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ మన్నె ఉషాశారద హెచ్చరించారు. తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో కొందరు మైనింగ్ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మండలంలో మైనింగ్ పరంగా అనుమతులు లేని కొండలు, క్వారీలు, మట్టి గుట్టల నుండి అక్రమ తోలకాలు జరిపితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మైనింగ్ శాఖ పర్మిట్ మంజూరు చేసిన క్వారీల నుండే మట్టిని తరలించాల్సి ఉంటుందన్నారు. దీనికి విరుద్ధంగా ఇష్టానుసారంగా మట్టిని తరలించే వారిపై చర్యలు తీసుకుని వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

# వైరా మండలంలో త్వరలోనే రెండు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం/వైరా:** జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య వైరా మండలం లింగన్నపాలెం గ్రామంలో క్షేత్ర ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వరి వేసిన పంట పొలాలను పరిశీలించారు. అదేవిధంగా గరికపాడులో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు త్వరలోధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం అవుతుందని అన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వైరా మండలానికి 2 కేటాయించడం జరిగింది. ఇవేకాకంపడా అదనపు మరో 2 సెంటర్స్‌ను కేటాయించాలని రైతులు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్, వ్యవసాయ విస్తరణ అధికారి సైదులు, లింగన్నపాలెం, గరికపాడు గ్రామ రైతులు దూదిపాళ్ల కిషోర్, తోటకూర నాగేశ్వరరావు, సజ్జా కృష్ణయ్య, లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, గోసు రాధాకృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులకు ఉత్తమ పురస్కారాలు అందజేత





### వైద్యులు రాంప్రసాద్, శైలేష్‌కు అభినందనలు తెలిపిన ఎంఎల్ఏ కూనంనేని

**ప్రజాపక్షం/పాల్వంచ :** లక్షల రూపాయల విలువైన శస్త్ర చికిత్సలు, వైద్యం నిరుపేదలకు ఉచితంగా అందజేసినందుకు గానూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నుండి పాల్వంచ ప్రభుత్వ వైద్యశాలకు చెందిన వైద్యులకు ప్రతిష్టాత్మకమైన ఉత్తమ ప్రతిభ పురస్కారాలు లభించాయి. హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ పి. రాం ప్రసాద్, ఆర్థోపెడిక్ వైద్యులు శైలేష్‌లు అవార్డులను అందుకొన్నారు. ఈ సంధర్భంగా ఎంఎల్ఏ కూనంనేని సాంబశివ రావు అభినందనలు తెలియజేస్తూ ప్రకటనను విడుదల చేశారు. లక్షల విలువైన ఆపరేషన్‌లను నిరుపేదలకు ఉచితంగా అందిస్తూ ప్రభుత్వ వైద్యంపై పేద, మధ్య తరగతి వర్గాలకు నమ్మకం కలిగిస్తున్నారని అభినందించారు. పేద వర్గాలకు ప్రభుత్వ వైద్యశాలల్లో కార్పోరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు వైద్య సిబ్బంది చేస్తున్న కృషిని ప్రతీ ఒక్కరు అభినందించి మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పేదలకు వైద్యం అంది ంచడానికి, ఆసుపత్రి అభివృద్ధికి పాటుపడుతున్న డిసిహెచ్ఎస్ రవి బాబు, ఆసుపత్రి సూపరిండెంట్ రాంప్రసాద్, ఎంఆర్ఓ సోమరాజుదొర, సిబ్బందిని అభినందించారు. పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో 100 పడకల కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# వైరాలో గ్యాస్ గోస..!

- బ్లాక్ మార్కెట్‌కి భారీగా తరలింపు
- ఆన్‌లైన్ బుక్ చేసిన సిలిండర్లు గల్లంతు
- రాత్రిపూట రహస్యంగా తరలింపు




**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం సమీపంలో ఉన్న కాణిపాకం గ్యాస్ గౌడాన్ వద్ద గ్యాస్ కోసం ప్రజలు గోస చెప్పలేనిది. గ్యాస్ కొరతను సృష్టించేది వారే బ్లాక్ మార్కెట్‌కు తరలించేది వారే. వైరాలో జరుగుతున్న కమర్షియల్ వ్యాపార నిర్వాహకులకు హోటల్స్‌కు బ్లాక్ మార్కెట్ నిర్వాహకులకు కాణిపాకం గ్యాస్ గౌడాన్ నుంచి పెద్ద ఎత్తున సిలిండర్లు తరలిపోతున్నాయి. ఒక్కొక్క సిలిండర్ రూ.2500ల వరకు విక్రయాలు కొనసాగిస్తున్నాయి. గడిచిన నెల రోజుల వ్యవధిలోనే వైరాలోని కాణిపాకం ఏజెన్సీ నుంచి పెద్ద ఎత్తున బ్లాక్ మార్కెట్‌కి గ్యాస్ తరలింది అనే ఆర్పోణలు వినిపిస్తున్నాయి. రాత్రిపూట సైతం గ్యాస్ గౌడాన్ నుంచి ఆటోలో బయటకు సిలిండర్లను తరలిస్తున్నారు. వసతి గృహాలు రెసిడెన్షియల్ పాఠశాలల పేరు మీద ఈ బండలను బయటకు తరలిస్తున్నారు. అలా తీసుకెళ్లిన బండలు హోటల్స్ నిర్వాహకులకు అందజేస్తున్నారు. గ్యాస్ బుక్ చేసి నెలలు గడుస్తున్నా బుక్ చేసుకున్న వారికి గ్యాస్ అందడం లేదు. కాని ఆన్‌లైన్ బుకింగ్ చూస్తే గ్యాస్ డెలివరీ అయినట్లు చూపెడుతున్నారు. ఇది కాణిపాకంలో జరుగుతున్న ఓ విచిత్రమైన గ్యాస్ మాఫియా మండలంలో పెద్ద ఎత్తున ఇప్పటికే ప్రజలు గ్యాస్ బుక్ చేసుకున్నారు. రోజులు గడుస్తున్న సిలిండర్ ఇవ్వడం లేదు. బుక్ చేసిన విధానాన్ని పరిశీలిస్తే వారి పేరు మీద ఉన్న సిలిండర్లు ఆల్‌రెడీ డెలివరీ అయినట్లు చూపెడుతున్నారు. ఇది కాణిపాకంలో జరుగుతున్న ఓ విచిత్రమైన గ్యాస్ మాఫియా. మండలంలో పెద్ద ఎత్తున ఇప్పటికే ప్రజలు గ్యాస్ బుక్ చేసుకున్నారు. రోజులు గడుస్తున్న సిలిండర్ ఇవ్వడం లేదు. బుక్ చేసిన విధానాన్ని పరిశీలిస్తే వారి పేరు మీద ఉన్న సిలిండర్లు ఆల్‌రెడీ డెలివరీ అయినట్లు చూపిస్తున్నారు. జిల్లా సివిల్‌సప్లై అధికారులు జోక్యం చేసుకొని వైరాలోని కాణిపాకంలో జరుగుతున్న అక్రమ గ్యాస్ దందా అరికట్టాలని, రోజుల తరబడి ప్రజలు అక్కడే గ్యాస్ కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయవాల్సిన పరిస్థితి, ఒక్క సిలిండర్ కోసం వారం రోజులు సైతం తిరగాల్సిన పరిస్థితి ఇక్కడ ఏర్పడింది. అసలు గ్యాస్ కొరత ఎందుకు సృష్టిస్తున్నారు. ప్రజలకు సక్రమంగా ఎందుకు గ్యాస అందించడం లేదు. కాణిపాకం ఏజెన్సీపై ఎందుకు అధికారులు చర్యకు వెనకాడుతున్నారు. తప్పు జరుగుతున్న కూడా ఎందుకు స్పందించడం లేదు, ప్రజల ఫిర్యాదులు చేస్తున్నారు. ఇప్పటికైనా అక్రమ గ్యాస్ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.


2:49 PM

Dear Customer, your refill is already booked and will be delivered in due course. Kindly avoid repeated calls. We appreciate your patience
INDANE

Dear Customer, your refill is already booked and will be delivered in due course. Kindly avoid repeated calls. We appreciate your patience
INDANE

2:58 PM



# ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు.. ఆరోగ్యమే మహాభాగ్యం

### ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి - ఎంపీడీవో ఎస్ కే సిలార్ సాహెబ్




**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదని ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రస్తుత రోజుల్లో మనిషి జీవన శైలిలో మార్పులు చెందాయని ప్రతిరోజు మనిషి ఆరోగ్యంపై శ్రద్ధ వహించి వ్యాయామం సమతుల్య ఆహారం తీసుకోవాలని ఎంపీడీవో ఎస్.కె సిలార్ సహబ్ అన్నారు. సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 6 నుండి 11 వరకు వారం రోజులపాటు ఆరోగ్య నియమాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. ముందుగా సుబ్లేడ్ గ్రామంలో డాక్టర్ వసుంధర ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా ప్రతి ఒక్కరు ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం నినాదాన్ని తీసుకెళ్లాలని ఆయన కోరారు. మనిషి జీవన శైలిలో కనీసం ప్రతిరోజు 30 నిమిషాలు వ్యాయామం అవసరమని వ్యాయామంతో పాటు సమతుల్య ఆహారం తీసుకోవాలని తద్వారా మధుమేహం రక్తపోటు, గుండెపోటు కోవిడ్ 19 కరోనా వైరస్ డెంగ్యూ మలేరియా లాంటి ప్రాణాత్మక వ్యాధులనుంచి రక్షించుకోవచ్చని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా ఆశ వర్కర్లను సాల్వలతో ఆయన ఘనంగా సత్కరించారు. ఆశ వర్కర్ల సేవలు ఎంతో ప్రశంసనీయమని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంఘబత్తుల స్వాతి సుమన్ రెడ్డి, ఉప సర్పంచ్ కానిల్ కుమార్, స్థానిక ఎస్ఐ కూచిపూడి జగదీష్, సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ వసుంధర, హెల్త్ వర్కర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సర్పంచ్ మందా నాగరాజు అన్నారు. మంగళవారం గౌతమీపురం కాలనీలో క్రీడాకారులకు ప్రోత్సాహకంగా టీ షర్టలను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయికిరణ్ 11 జట్టుకు ఈ టీషర్టలను అందజేయడం జరిగిందన్నారు. యువత చెడు మార్గాలకు, చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. బూర్గంపాడు పేరును రాష్ట్ర స్థాయిలో నిలబెట్టాలని యువతకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో స్థానిక క్రీడాకారులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# లబ్ధిదారులకు సిఎంఆర్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలో లబ్దిదారులకు సిఎంఆర్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ రఘురామ రెడ్డి చేతుల మీదుగా సుమారు 36 మంది లబ్దిదారులకు మొత్తం రూ 8లక్షల 81వేల 500విలువైన చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఎంపీ రఘురామరెడ్డి మాట్లాడుతూ సింగరేణి మండల ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. మండల అభివృద్ది కోసం సర్పంచులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, అజ్మీరా నరేష్, సర్పంచులు అజ్మీరా ఉమా నరేష్, వడ్డే సులోచన రంగారావు, మోతీ వీరస్వామి, ధారావత్ వెంకటేశ్వర్లు, గుగులోతు కృష్ణవేణి వీరబాబు, దండు ప్రవీణ్, ఉండం రాఘవులు, ధారావత్ హేమ, గుగులోతు వరలక్ష్మి, కొమ్ము భద్రం, బానోత్ రూపాల, పొడుగు పెంటయ్య, వార్డు మెంబర్ ఆదేర్ల అంజయ్య, మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్, పాటి నర్సయ్య, నాయకులు తోగర శ్రీను, జర్పుల ధోనీ నాయక్, ఈసం లక్ష్మినర్సు, హర్ష నాయక్, నరేష్, బద్దె నాయక్, రవీందర్‌రెడ్డి, రెడ్డబోయిన జగ్గయ్య, గుంపిడి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నపురెడ్డిపల్లి నూతన తహసీల్దార్‌గా స్వర్ణ



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** నూతన తహసీల్ధార్ గా బి స్వర్ణ బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ తహసీల్ధార్ జగదీశ్వరి కార్యాలయ సిబ్బంది ఆమెకు సాధర స్వాగతం పలికారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ విభాగంలో సూపరిండెంట్‌గా పని చేశారు. ఇటీవల జరిగిన తహసీల్దార్ బదిలీల్లో భాగంగా అన్నపురెడ్డిపల్లి మండల తహసీల్ధార్‌గా బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేసిన తహసీల్దార్ ప్రతాప్ ప్రమోషన్‌లో ఆర్డీవోగా వెళ్లారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి తోడ్పడుతూ భూ సబస్యల పరిష్కరిస్తానని, మీ సేవ సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జగదీశ్వరి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, జిపిఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తహసీల్దార్‌కు నాయీ బ్రాహ్మణుల వినతి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** కుల వృత్తిదారులు, నాయి బ్రాహ్మణులను కులం పేరుతో దూషిస్తే కఠినంగా శిక్షించేందుకు ఎట్రాసిటీ యాక్టు తీసుకురావాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కుల వృత్తి దారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ తూమాటి శ్రీనివాస్ కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్షులు కడియాల శ్రీను మాట్లాడుతూ జిల్లా అధ్యక్షులు కడియాల సత్యనారాయణ ఆదేశాల మేరకు కుల వృత్తిదారుల న్యాయమైన సమస్యలపై తహశీల్దార్ కు వినతి పత్రం అందచేసినట్లు తెలిపారు. కుల వృత్తిని నమ్ముకున్న నాయి బ్రాహ్మణులు కాకుండా ఇతరులు ఈ వృత్తిలోకి రాకుండా పేటెంట్ హక్కులు కల్పించాలన్నారు. కుల వృత్తి దారుల అభివృద్ధికి కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని తహశీల్దార్ కు అందచేసిన వినతి పత్రంలో కడియాల శ్రీను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మాడుగుల నాగరాజు, వల్లోజి రమేష్, సురేష్, కళ్యాణ్, మణికుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం అందించే రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ బి.నాగరాజు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎటువంటి బకాయి లేకుండా ప్రతి సంవత్సరం ఆస్తి పన్ను చెల్లించుకుంటు వస్తున్న యజమానులకు 5శాతం రాయితీని కల్పిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ చెల్లించే ఆస్తి పన్ను ఏప్రిల్ 30వ తేదీలోపు చెల్లిస్తే చెల్లింపు నగదుపై ఐదుశాతం తగ్గించి ఆన్‌లైన్ లేదా కార్యాలయంలో చెల్లించి రశీదు పొందగలరని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆస్తి పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకుని మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని పేర్కొన్నారు.

# మహిళల భద్రతే పోలీసుల ధ్యేయం

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** చుంచుపల్లి షీ టీమ్స్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పి రోహిత్ రాజ్ మంగళవారం సందర్శించారు. ఆయన ముందుగా పరిసరాలను పరిశీలించారు. మహిళలపై లైంగిక వేదింపులు, ర్యాగింగ్ , ఈవ్ టీజింగ్, బ్లాక్మెయిలింగ్, ఇతర ఇబ్బందులు ఎదుర్కొనే మంహిళలు జిల్లా షీ టీమ్స్ ను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అడ్డుకుని వారికి న్యాయం చేసేందుకు వీలుగా ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర పోలీసులు ఏర్పాటు చేసిన టిజిడబ్ల్యూఎస్ డబ్ల్యూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన విభాగం షీ టీమ్స్ అని చెప్పారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు నేరుగా సంప్రదించాలని తెలిపారు.

# గోపె వినయ్ కుమార్‌పై పోలీసులకు ఫిర్యాదు

**ప్రజాపక్షం/కూసుమంచి:** స్థానిక కూసుమంచి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం గోనె వినయ్ కుమార్‌పై యడవల్లి శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వివరాల్లోకొస్తూ మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన ఫిర్యాదుదారు యడవల్లి శ్రీకాంత్ అదే గ్రామానిఇక చెందిన పాలేరు పంచాయితీ కార్యదర్శికి 18వేల రూపాయలు లంచం ఇచ్చినట్లుగా గత రెండు రోజుల నుండి గోపె వినయ్ కుమార్ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ వారి పరువు ప్రతిష్టలకు భంగం కలిగిస్తున్నారని, ఇంకా గోపె వినయ్ కుమార్ వ్యక్తిగతంగా తనకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడినట్లు ఈ విషయాలపై విచారణ జరపాలని, తనకు రక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఫిర్యాదు విషయంపై కూసుమంచి పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగరాజుని వివరణ కోరగా ఫిర్యాదు అందిన విషయము వాస్తవమేనని తెలిపారు.

# రైతాంగ సమస్యలు పరిష్కరించండి

**-మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచండి**
**-అర్హులైన ప్రతి రైతుకు పాసుపుస్తకాలు అందించాలి**
**-రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా**






**ప్రజాపక్షం/ ఖమ్మం :** రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట గల ధర్నాచౌక్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం అరకొరగా తెరిచిందని దీనితో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. విరివిగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తెరవడంతో పాటు ఎకరాకు 26 క్వింటాళ్ల నిబంధనను ఎత్తివేసి ఎటువంటి షరతులు లేకుండా మొక్కజొన్నను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే యాసంగి ధాన్యం రైతుల చేతికి వచ్చిందని త్వరితగతిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఏప్రిల్ చివరి వరకు సాగర్ జలాలను అందించాలన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ భూ భారతి ద్వారా అర్హులైన రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 54 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం ఏడు కేంద్రాలను మాత్రమే ప్రారంభించడం రైతులను నష్టపర్చడమేనన్నారు. ఖమ్మంజిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 2.65 లక్షల ఎకరాల్లో ధాన్యం సాగు చేశారని దిగుబడులకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. వారసత్వంగా వస్తున్న భూములను నిషేధిత జాబితాలో చూపించారని దీని వల్ల రైతులకు హక్కులు లేకుండా పోయాయని అవసరాలకు విక్రయించే పరిస్థితి లేకుండాపోవడంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూ భారతి సమస్త భూ సమస్యలకు పరిష్కారం చూపాలని బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బండి రమేష్, ఎస్‌కె మీరా, కృష్ణ, జి. నాగేశ్వరరావు, వాసిరెడ్డి ప్రసాద్, గంగాధర్, దొండపాటి నాగేశ్వరరావు, నర్సింహారావు, నల్లమోతు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

# కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక ప్రభుత్వం

**వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లలో వైఫల్యం - మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని మాజీ శాసన సభ్యులు, బిఆర్‌ఎస్ నాయకులు సండ్ర వెంకటవీరయ్య ఆరోపించారు. వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. మంగళవారం బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెంకటవీరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తుందని దీనితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులు చేతికి రాకముందే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో పాటు బస్తాలు, కొనుగోళ్లకు సంబంధించిన నిధులను సిద్ధం చేసేదని ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు రైతులను దోచుకుంటున్నారని ఒక్కో క్వింటాకు ధాన్యం రైతులు రూ.600 నష్టపోతుండగా మొక్కజొన్న సాగు చేసిన రైతులు రూ.900 మేర క్వింటాకు నష్టపోతున్నారని ఆయన తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి సత్తుపల్లికి ధాన్యం దిగుమతి అవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా బోనస్ అమలు కావడం లేదన్నారు. 40 శాతం ధాన్యం విక్రయించిన తర్వాత కొనుగోలు కేంద్రాలు తెరిచి ఫలితం ఏముందన్నారు. మీడియా సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, బిఆర్‌ఎస్ నాయకులు ఉన్నం బ్రహ్మయ్య, లక్ష్మారెడ్డి, వెంకట్రావు, పగడాల నరేందర్, సామినేని హరిప్రసాద్, ముత్యాల వెంకటప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**తొమ్మిదిన బిఆర్‌ఎస్ ఆందోళనలు :** వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అన్ని మండలాల్లో ఈనెల తొమ్మిదిన ఆందోళనలు నిర్వహించాలని బిఆర్‌ఎస్ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధు ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# భూదాన్ లబ్ధిదారుల్లో అనర్హులను తొలగించండి

**-అర్హులైన వారికి నివాస స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు కేటాయించండి - మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** వెలుగుమట్ల భూదాన్ భూ నిర్వాసితుల్లో అనేక మంది అనర్హులకు పట్టాలు ఇచ్చారని అనర్హులను తొలగించి అర్హులకు లబ్ది చేకూర్చాలని సిపిఐ (ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 311 మందిలో అనర్హులు ఉన్నారని తిరిగి సర్వే జరిపించి అనర్హులను తొలగించి అర్హులైన వారికి అవకాశం కల్పించాలన్నారు. మంగళవారం సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ గార్డెన్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళనను ఉద్దేశించి రంగారావు మాట్లాడుతూ మొత్తం 311 మందిలో 130 మందికి భూదాన్ భూమితో ఏనాడు ఎలాంటి సంబంధం లేదని అనర్హుల పేర్లు తమ వద్ద ఉన్నాయని ఆ 130 మందిని తొలగించకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. 700 ఇండ్లు కూల్చివేసి 311 మందికి స్థలాలు ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇంటి స్థలాలను, ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని




ఇతర ప్రాంతాల నుంచి వచ్చి జీవనోపాధి కోసం ఖమ్మంలో నివసిస్తున్న వారికి కూడా భూదాన్ భూముల్లో నివాస స్థలాలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూదాన్ నిర్వాసిత నాయకులు సత్యనారాయణరెడ్డి, కోటేశ్వరరావు, మాస్‌లైన్ నాయకులు ఆవుల అశోక్, శోభ, లాల్‌మియా, వెంకటేశ్వర్లు, కవిత, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యంపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

**- కలెక్టర్**

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఏజెన్సీ ప్రాంత ప్రజలు ప్రభుత్వ వైద్యం పై పెట్టుకున్న నమ్మకాన్ని వైద్యులు నిలబెట్టాలని కలెక్టర్ అంకిత్ సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పాల్వంచ వైద్య ఆరోగ్య శాఖ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యాతిధిగా హాజరై మాట్లాడారు. ప్రజలు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ద్వారా వారి విశ్వాసాన్ని మరింతగా పెంచవచ్చన్నారు. ఇది అత్యంత కీలకం అని, ఈ నమ్మకాన్ని నిలబెట్టడం ప్రతీ అధికారి బాధ్యత అన్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే మన జిల్లాలో వైద్య ఆరోగ్య సేవలు మెరుగ్గా ఉన్నాయని, దీనిపై ప్రజల నమ్మకం అంతే ఉందన్నారు. జిల్లా వైద్యాధికారి తుకారం రాథోడ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా 43 మంది ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ దారా రాంబాబు, డిప్యుటీ డిఎంహెచ్ఓ ప్రసాద్ నాయక్, డా. స్పందన, డా.తేజస్వీ, వైద్యశాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మంచి మనసున్న మారాజు మా(హా)రాజ్

**- ఆపదలో ఉన్నవారికి అభయహస్తం**
**- ఎస్సై రాజ్‌కుమార్ ఉదారత**
**- మరోసారి మానవత్వం చాటుకున్న పాకాల కొత్తగూడ ఎస్సై రాజ్‌కుమార్..**
**- బాధితులకు ఆర్థిక సాయం...**






**ప్రజాపక్షం/కరకగూడెం:** ఆపదలో ఉన్నామంటే చాలు నేనున్నానంటూ ముందుకొచ్చే పాకాల కొత్తగూడ ఎస్సై రాజ్‌కుమార్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. విధి నిర్వహణలోనే కాకుండా సేవా కార్యక్రమాల్లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన, తాజాగా ఒక నిరుపేద కుటుంబానికి అండగా నిలిచారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కరకగూడెం మండలం, శ్రీరంగాపురం గ్రామానికి చెందిన గోగు రజిత ఆమె చిన్నారి ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా ఎస్సై రాజ్‌కుమార్ దృష్టికి వెళ్ళింది. వెంటనే స్పందించిన ఎస్సై గతంలో కరకగూడెం పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన సమయంలోనే రాజ్‌కుమార్ స్థానిక ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ మంచి మనసున్న మారాజుగా పేరు తెచ్చుకున్నారు. బాధితుల పరిస్థితిని తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి, తన వంతు సహాయంగా 3,000 రూపాయలను ఆ కుటుంబానికి అందజేశారు. ప్రజల ప్రశంసలు:ఖుషీలో ఉన్నప్పుడు కాకుండా, కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకునే గుణమే అసలైన మానవత్వమని రాజ్‌కుమార్ మరోసారి నిరూపించారు. ఆయన చేసిన ఈ చిన్న సహాయం ఆ కుటుంబానికి కొండంత అండగా నిలిచింది. పోలీస్ అంటే కేవలం శాంతిభద్రతలే కాకుండా, సామాజిక బాధ్యత కూడా అని చాటిచెప్పిన ఎస్సైపై స్థానిక ప్రజలు మరియు సోషల్ మీడియా వేదికగా ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు.

# విపత్తుల సమయంలో ప్రజలే మొదటి రక్షకులు

**-ఎన్‌డీఆర్‌ఎఫ్ అవగాహన కార్యక్రమం**




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** విపత్తల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించడంలో ప్రజల అవగాహన కీలకమని ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు పేర్కొన్నారు. మంగళవారం బూర్గంపాడు జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశంలో సుమారు 16 బెటాలియన్లతో పని చేస్తున్న నేషనల్ డిజాస్టరట్ రెస్పాన్స్ ఫోర్స్(ఎన్‌డీఆర్‌ఎఫ్)140 కోట్ల జనాభా ఉన్న భారతదేశంలో మాత్రమే కాకుండా విదేశాల్లో కూడా సేవలందిస్తోందని అన్నారు. ఇటీవల శ్రీలకంలో కూడా సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అయితే విపత్తు సంభవించిన వెఉంటనే ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ప్రతి చోటుకు చేరుకోవడం సాధ్యం కాదని, అందుకే స్థానిక ప్రజల అవగాహన అత్యంత అవసరమని తెలిపారు. విపత్తులు రెండు రకాలుగా ఉంటాయని ఒకటి మనుషుల వల్ల జరిగే మ్యాన్ మేడ్ విపత్తులుగా కాగా, మరొకటి ప్రకృతి వైపరీత్యాలు, భూకంపాలు, వరదలు,అ గ్ని ప్రమాదాలు వంటి సంఘటనలు ఎప్పుడు సంభవిస్తాయో చెప్పలేమని, సమాచారం అందేలోపు నష్టం జరిగే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రత్యేకంగా గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రతి ఏడాది వరదలు సంభవిస్తున్నాయని, అలాంటి సందర్భాల్లో అధికారులు ముందుగానే గ్రామాలను ఖాళీ చేయాలని సూచిస్తారని, అయితే చాలా మంది ప్రజలు ఆ సూచనలు పాటించకుండా చివరి నిమిషంలో సహాయం కోరడం వల్ల ప్రమాదం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం మునిగే పరిస్థితి ఉంటే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాలను వెళ్లాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ప్రజల్లో విపత్తులపై అవగాహన పెంపొందించడం, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో తెలియజేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, పాల్వంచ డిఎస్‌పి సతీష్ కుమార్, డిఎంహెచ్‌వో డాక్టర్ తుకారం రాథోడ్, ఎంపీడీవో జములారెడ్డి, ఎంఈవో యెదు సింహారాజు, సర్పంచ్ మందా నాగరాజు, ఎస్ఐ మేడ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య, ఆర్ఐ వీర్రాజు, పంచాయితీ కార్యదర్శులు, జీపీవోలు, సీసీలు, హెల్త్ సిబ్బంది, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.